క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



వీరవరంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రవి

కిర్లంపూడి: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు చక్కటి విద్య అందుతుందని ఎంపీపీ తోట రవి అన్నారు. మండలంలోని వీరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నూతన పాఠ్య, నోట్ పుస్తకాలను శనివారం ఆయన పంపిణీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, గొల్లపల్లి సూరిబాబు, విద్యా కమిటీ చైర్మన్ పెద్దాడ లోవబాబు, కుక్కల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయాలకు పోటెత్తిన భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ, గుమ్మళ్లదొడ్డి గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలకు శనివారం భక్తులు పోటెత్తారు. తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఉదయం నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే గుమ్మళ్లదొడ్డి గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వల్మీక వేంకటేశ్వరస్వామి ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచి వివిధ మండలాల నుంచి భక్తులు కాలినకడను ఆలయానికి వచ్చి ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం ఆయా ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు.
ఆలయ కమిటీల సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తాళ్లూరు మఠంలో అన్నసమారాధన

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు జీయ్యన్న మఠంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. భక్తుల సహకారంతో అన్నదానం జరిపినట్టు జీయర్ శాశ్వత అన్నదాన నిధి కమిటీ సభ్యులు తెలిపారు. తొలుత శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

500 మందికి వైద్య పరీక్షలు



జె.కొత్తూరులో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరులో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎవర్ లాస్టింగ్ గాస్పల్ చర్చి పాస్టర్ పెదపాటి రాంబాబు, సీహెచ్ రాజేష్ ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన సూర్య గ్లోబల్ మల్టీస్పెషాలిటీ హాస్పటిల్ సహకారంతో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు దక్షిణామూర్తి, శ్రీనివాస్ 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన రాష్ట్ర హోం మంత్రి అనిత



సత్యదేవుని సన్నిధిలో హోం మంత్రి అనిత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ తదితరులు

అన్నవరం: రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ శనివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. సత్యదేవుని ఆలయం వద్ద వారికి దేవస్థానం ఈఓ కె. రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను దేవస్థానం ఈఓ రామచంద్రమోహన్ అందజేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని సత్యదేవుని కోరుకున్నట్లు తెలిపారు.

మరిడమ్మ జాతరకు పందిరి రాట

పెద్దాపురం: ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే మరిడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం పందిరి రాట వేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రాల నడుమ పందిరి రాట వేశారు. ఈ సందర్భంగా ఈఓ రామ్మోహనరావు మాట్లాడుతూ అమ్మవారి గరగ ఉత్సవాన్ని నిర్వహించారు. వచ్చే నెల 4 నుంచి అమ్మవారి జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

కండి వాగుపై లాకులకు మోక్షమెప్పుడో ?

- ముంపు బారిన పడుతున్న పొలాలు
- పంటలు నష్టపోతున్న రైతులు
- లాకులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



లాకులు లేకపోవడంతో కండివాగు మదుం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)

కోటనందూరు: మండలంలోని కొత్తకొట్టాం వద్ద కండివాగుపై బ్రిడ్జి నిర్మించినా మదుం వద్ద లాకులు ఏర్పాటు చేయకపోవడంతో రైతుల ఇబ్బందులు యథావిధిగా కొనసాగుతున్నాయి. గతంలో మాదిరిగానే తుపానుల సమయంలో పంట పొలాలు భారీగా ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ వాగు సర్‌ప్లస్ వ్యూయర్ (కండి వాగు మదుం) వద్ద లాకులు నిర్మించకపోతే రైతుల ఇబ్బందులు తొలగే పరిస్థితి లేదు. ఇక్కడ లాకులు నిర్మించాలని రైతుల దశాబ్దాలుగా విజ్ఞప్తి చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కండివాగు దిగువ ప్రాంతంలోని బాడవగెడ్డ పూడుకుపోవడం, లాకులు లేని కారణంగా వరదలు, తుపానుల సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

పదేళ్ల క్రితం బ్రిడ్జి నిర్మాణం

మండలంలో పాతకొట్టాం, కొత్తకొట్టాం గ్రామాల మధ్య వరద నీరు దిగువకు పోయేందుకు కండివాగు ఉంది. ఈ వాగుపై ఉన్న వంతెన దిగువభాగంలో స్తంభాల మధ్య ఖాళీ తక్కువగా ఉండడంతో భారీ వర్షం పడిన ప్రతిసారీ చుట్టు పక్కల చెరువుల నుంచి వచ్చే వరద నీటితో కండివాగు పొంగడం, వందలాది ఎకరాలు నీట మునగడం, రైతులు పంటలు నష్టపోవడం సర్వసాధారణంగా మారింది. ఈ గెడ్డ కేపీ మల్లవరం వద్ద బాడవ గెడ్డగా మారి కేఓ అగ్రహారం వద్ద తాండవ నదిలో కలుస్తుంది. ఈ నేపథ్యంలో రైతుల విజ్ఞప్తి మేరకు పదేళ్ల క్రితం కండివాగుపై రూ.20 లక్షలతో పెద్ద బ్రిడ్జి నిర్మించారు. రూ.లక్షలు ఖర్చు చేసి బ్రిడ్జి నిర్మించినా రైతుల సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. బ్రిడ్జి నిర్మాణ సమయంలో రాకపోకలకు వీలుగా కండివాగులో కాంట్రాక్టరు మట్టిని వేశారు. వేసిన మట్టిని నిర్మాణం పూర్తయినా గాని తొలగించక పోవడం, గెడ్డలో భారీగా పూడిక పేరుకుపోవడంతో తుపానుల సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న పొలాలన్నీ యథావిధిగా ముంపునకు గురవుతున్నాయి.

లాకులు లేకపోవడమే అసలు సమస్య

ఈ వాగు కారణంగా సాగునీటి ప్రయోజనాల కంటే వరదనీటి ప్రమాదాలే ఎక్కువని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కండివాగు సర్‌ప్లస్ వియర్ వద్ద పెద్ద మలుపు ఉండడంతో నీరు వెనుకకు ఎగతన్నడం, నది తరువాత వ్యూయర్ (బాడవ గెడ్డ) ఆక్రమణలకు గురి కావడంతో ముంపు సమస్య తలెత్తుతోందని రైతులు చెబుతున్నారు. బాడవ గెడ్డపై చోటు చేసుకున్న ఆక్రమణలు తొలగించి గెడ్డను వెడల్పు చేస్తేనే గాని కండివాగు కింద ముంపు సమస్య తీరదు. లాకులు లేని కారణంగా వరద నీటిని అదుపు చేయడం వీలుపడడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గెడ్డ క్రింద సుమారుగా 600 ఎకరాల ఆయకట్టు ఉంది.

రూ.85 లక్షలతో ప్రతిపాదనలు

కండివాగు అభివృద్ధి, లాకుల ఏర్పాటుకు రూ.25 లక్షలతో ఈ వాగుపై ఇటువైపు గట్టు నుంచి అవతలి గట్టుకు వెళ్లేందుకు ఐదు బ్రిడ్జిల నిర్మాణానికి మరో రూ.60 లక్షలతో అధికారులు గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అవి కార్యరూపం దాల్చకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

లాకులు ఏర్పాటు చేయాలి



కండివాగుపై బ్రిడ్జి వెడల్పుగా కట్టినప్పటికీ కండివాగు మదుం వద్ద లాకులు లేకపోవడం, బాడవ గెడ్డ కుచించుకుపోవడంతో వరద నీరు తొందరగా లాగడం లేదు. ఈ కారణంగా కండివాగు ముందు, వెనుక భాగంలో ఉన్న పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. బాడవ గెడ్డను వెడల్పు చేసి, కండివాగుపై లాకులు ఏర్పాటు చేస్తేనే ముంపు బారి నుంచి రైతులు బయట పడతారు. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

– చిటికెల బాపన్నదొర, రైతు, కొత్తకొట్టాం

భక్తిశ్రద్ధలతో పారాయణలు



ఏలేశ్వరం రూపులమ్మ ఆలయంలో పారాయణ చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: స్థానిక రూపులమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పారాయణ పఠనం చేశారు. విశ్వహిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళాసంఘాల సభ్యులు ఆలయప్రాంగణంలో విష్ణుసహస్రనామ, భగవద్గీత, లక్ష్మీఅష్టోత్తర, లలితాసహస్ర పారాయణలు చేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ కార్యదర్శి కటకం కిరిటీ, సంఘ మహిళా సభ్యులు మల్లేశ్వరి, సూర్యాకుమారి, కల్యాణి, ఇందిరా, లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

కౌలు వేలం వాయిదా

ప్రత్తిపాడు: మండలంలోని ధర్మవరం గ్రామంలో వేంచేసిన రాజగోపాల స్వామి, విశ్వేశ్వరస్వామి వార్ల దేవస్థానం భూములకు శుక్రవారం నిర్వహించాల్సిన బహిరంగ కౌలు వేలాన్ని కొన్ని అనివార్య కారణాలతో వాయిదా వేసినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి టీవీ సూర్యనారాయణ తెలిపారు. ధర్మవరంలో రాజగోపాలస్వామి, విశ్వేశ్వర స్వామి వార్ల దేవస్థానం భూములకు మూడేళ్ల కాలపరిమితితో నిర్వహించే బహిరంగ వేలం కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆయన చెప్పారు.

మండలాభివృద్ధే లక్ష్యం

- ఎంపీపీ లగుడు శ్రీనివాసు
- కోటనందూరులో మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: మండలాభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ జయమాధవి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడుతూ అధికార యంత్రాంగం మండల ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్యం, మంచినీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పారామెడికల్, మెడికల్ సిబ్బంది అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు మెరుగైన సేవలందించాలని వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



గెద్దనాపల్లిలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన ఐసీడీఎస్ అధికారులు

కిర్లంపూడి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. గెద్దానాపల్లి అంగన్‌వాడీ కేంద్రం-2లో ప్రీ స్కూల్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.పూర్ణిమ మాట్లాడుతూ మూడేళ్లు నిండిన పిల్లలను స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. చిన్నారులకు చక్కటి విద్యను, మానసిక ఉల్లాసానికి ఆటపాటలతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బూసమ్మ, హెచ్‌ఎం టీఎస్ పురుషోత్తం, సెక్రటరీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు



సమావేశంలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

తుని: మండల ప్రజలకు రక్షిత తాగునీరు సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ రవికుమార్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రవికుమార్ మాట్లాడుతూ నిబంధనల మేరకు వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. వివిధ దశలలో నీటిని పరీక్షించిన తరువాతే కుళాయిలకు సరఫరా చేయాలని ఆదేశించారు. మంచినీటి సరఫరా వ్యవస్థలో ఎక్కడా లీకులు లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తాగునీటి సరఫరాలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివాజీ పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం



శంఖవరంలో నేలకొరిగిన చెట్లు

శంఖవరం: మండల వ్యాప్తంగా శనివారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కబోత ఎక్కువగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వర్షానికి ప్రజలు సేద తీరగా రైతన్నలు సంతోషం వ్యక్తం చేశారు.

అధికారులకు పనులపై అవగాహన అవసరం



జగ్గంపేట ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: నియోజకవర్గంలో ఇప్పటివరకూ చేపట్టిన పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ పనులపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, లెక్కలు చూపించాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ స్థాయి ఇంజినీర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిర్లంపూడి మండలం సోమరాయణపేటలో రైతు భరోసా కేంద్రం పూర్తి కాకుండానే బిల్లులు చేయించిన ఘటనపై జేఈని ప్రశ్నించారు. త్వరలో మళ్లీ సమీక్ష సమావేశం నిర్వహిస్తానని, అప్పటికి గ్రామ సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు, రోడ్లు, డ్రైన్లు తదితర అభివృద్ధి పనులకు సంబంధించి అన్ని వివరాలు సమగ్రంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఈఈ మల్లికార్జునరావు, డీఈలు గంగాధర్, ఉమాశంకర్, జేఈ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

నియోజవర్గానికి చెందిన యూటీఎఫ్ నేతలు, రాష్ట్ర బేవరేజ్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు, పలు గ్రామాల నేతలు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాలపై ప్రచారం



ఏలేశ్వరంలో ప్రచారం చేస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: స్థానిక అనంతలక్ష్మీ సమేత సత్యనారాయణస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలపై శనివారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. స్థానిక ఏలేరునది ఒడ్డున వేంచేసిన స్వామి వారి ఆలయంలో ఈ నెల 17న స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్నవరం దేవస్థానం ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనం ద్వారా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యంలో స్వామివారి కల్యాణోత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు పొన్నూరు సత్యనారాయణాచార్యులు, నరసింహాచార్యులు, మలిరెడ్డి సముద్రయ్య, భక్తులు పాల్గొన్నారు.

సాంకేతికతపై యువత దృష్టి సారించాలి

- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



యర్రవరంలో ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

ఏలేశ్వరం: యువత సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. మండలంలోని యర్రవరంలో శనివారం ఆయన సైంటిఫిక్ ప్రోగ్రాం అండ్ రీసెర్చ్ క్యూబ్ (స్పార్క్) ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. సైబర్ సెక్యూరిటీపై స్పార్క్ సంస్థ సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం స్పార్క్ చైర్మన్ సాయిసందీప్‌ను అభినందించారు. కార్యక్రమంలో సీఐ శేఖర్‌బాబు, ఎస్సై సతీష్, డీఆర్‌డీఓ సైంటిస్టు విక్రాంత్, స్పార్క్ సభ్యులు రవికిరణ్, అదిత్య, సాహుల్, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



జగ్గంపేటలో విలేకర్లతో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

జగ్గంపేట: ప్రభుత్వ అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఆయా పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నేతలు కోరారు. జగ్గంపేటలో శనివారం పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కడితి సతీష్, పలువురు నేతలు విలేకర్ల సమావేశం నిర్వహించారు. జగ్గంపేట మండలంలో గతంలో అనుమతులు లేని పాఠశాలల్లో రూ.వేలల్లో ఫీజులు కట్టి చేరిన విద్యార్థులు ఆ తరువాత పాఠశాలలను అర్ధాతరంగా మూసివేయడంతో ఆర్థికంగా నష్టపోయారన్నారు. అప్పట్లో మండల విద్యాశాఖాధికారులు హడావిడి చేసి చేతులు దుపుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం మళ్లీ అదే తంతు కొనసాగుతోందని విమర్శించారు. జగ్గంపేట ఐదు పాఠశాలలకు అనుమతులు లేవని ఆరోపించారు. తక్షణమే వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు రమణ, శ్రీను, అర్జున్, సురేష్ పాల్గొన్నారు.

ప్రపంచ కవులకు ఆదర్శం శ్రీశ్రీ

పెద్దాపురం: కాదేదీ కవితకనర్హమంటూ ఎందరో కవులకు ఆదర్శప్రాయంగా నిలచి కవులను తయారు చేసిన కర్మాగారం ప్రముఖ రచయిత శ్రీశ్రీ అని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. శ్రీశ్రీ 41వ వర్ధంతి శనివారం స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం, సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు మాట్లాడతూ నిరంతరం కష్టజీవులకు ఇరువైపులా కాపు కాసేవాడే కవి అని నిరూపించిన వ్యక్తి శ్రీశ్రీ అన్నారు. సమాజానికి ఆయన అందించిన రచనలు ఎనలేనివని శ్రీశ్రీ సేవలను కొనియాడారు.

గలగలా గోదారి పరుగులు

- ఖరీఫ్ సాగుకు రైతుల సమాయత్తం
- బోర్లపై ఆధారపడిన పొలాల్లో ఇప్పటికే ప్రారంభం
- చుక్క కూడా నష్టపోకుండా అధికారుల చర్యలు
- ప్రవాహ వేగాన్ని తగ్గిస్తున్న గుర్రపు డెక్క
- ఊరిస్తూ ఉసూరుమనిపిస్తున్న రుతు పవనాలు



గోదావరి కాలువ నుంచి పంట కాలువలకు వెళ్తున్న నీరు

సామర్లకోట: గోదావరి కాలువకు నీరు విడుదలైంది. దాంతో రైతులు, మున్సిపల్ అధికారులు గోదావరి నీటిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకు ఉన్న గోదావరి కాలువలో నీరు పట్టణ, మండల పరిధిలోని సుమారు 18,500 ఎకరాలకు, పెద్దాపురం మండల పరిధిలో మూడు వేల ఎకరాలకు అందుతుంది. దీనిలో భాగంగా కాపవరం ఎత్తిపోతల పథకం కింద 600, బిక్కవోలు లింగాల ఎత్తిపోతల పథకం కింద 500, పీబీ దేవం-1 ఎత్తిపోతల పథకం కింద 1,100, ఇల్లపల్లి ఎత్తిపోతల పథకం కింద 750, జి.మేడపాడు ఎత్తిపోతల పథకం కింద 1200, వేట్లపాలెం ఎత్తిపోతల పథకంలో 1200 ఎకరాలు సాగు అవుతున్నాయి. గోదావరి కాలువకు నీరు రావడంతో ఆయా ఎత్తిపోతల పథకాల నిర్వాహకులు సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే బోర్లపై ఆధారపడి ఉన్న రైతులు వరి సాగు ప్రారంభించారు. సామర్లకోట, పీబీ దేవం, వేట్లపాలెం, జి.మేడపాడు, జి.కొత్తూరు, హుస్సేన్‌పురం, ఉండూరు, అచ్చంపేట, వీకే రాయపురం, మాధవపట్నం గ్రామాల రైతులు గోదావరి కాలువను, చంద్రంపాలెం, గొంచాల, నవర గ్రామ ప్రజలు పితాపురం బ్రాంచి కెనాల్, ఏలేరు కాలువ నీటిని సాగునీటిగా ఉపయోగిస్తారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మండల పరిధిలో 22,500 ఎకరాల వరి సాగవుతోందని మండల వ్యవసాయాధికారులు చెప్తున్నారు. గోదావరి కాలువకు నీరు వచ్చినా రైతులకు మేలు జరిగే అవకాశం కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. గోదావరి కాలువ నీటితో పాటు గుర్రపు డెక్క కొట్టుకు వస్తోందని దీని వల్ల ప్రవాహ వేగం తగ్గి నిర్ణీత ఎకరాలకు నీరు అందదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటికి సిద్ధం

గోదావరి కాలువలో నీటిని సామర్లకోట, పెద్దాపురం మున్సిపాలిటీలో తాగునీటిగా ఉపయోగిస్తారు. ఈ మేరకు గోదావరి జలాలు విడుదల కావడంతో వ్యర్థ జలాలు సముద్రంలోనికి పోయిన తరువాత స్వచ్ఛమైన నీటిని తాగునీరుగా ఉపయోగించేలా మున్సిపల్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. సామర్లకోట ఫిల్టర్ చెరువు ఆకు పచ్చరంగులో ఉంది. దాంతో గోదావరి జలాలు నేరుగా ఫిల్టరుబెడ్‌లోనికి పంపి శుద్ధి చేస్తామని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. చెరువులో నీటిని పూర్తిగా తీసి వేసి పూడిక తీయిస్తామని తెలిపారు.

జాడ లేని రుతు పవనాలు

గత 15 రోజులుగా రుతు పవనాలు వస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటిస్తున్నా ఇప్పటి వరకు వర్షాలు రాక పోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గోదావరి కాలువ నీటితో పాటు వర్షపు నీరు తోడైతే చేలకు మేలు జరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బాల్య వివాహాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం



సామర్లకోట జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సామర్లకోట: బాల్య వివాహాలు లేని సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని మండల విద్యాశాఖాధికారి వై శివరామకృష్ణయ్య అన్నారు. బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి బాలిక చదువు కోవాలని, బడి బయట పిల్లలు లేకుండా ఉండే విధంగా జూలై 12 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ మేరకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 పి పుల్లయ్య, హెచ్‌ఎం మీనామాధురి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసు, ఐసీడీఎస్ సీడీపీఓ ఉష, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం ప్రసూన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.